# తట్టలు

నూకాలు తుళ్ళిపడి లేచింది. ఎవరో గట్టిగా చరిచి లేపినట్టు నిద్రలేచింది. నూకాలును టైముకి లేపడానికి అక్కడ సెల్‌ఫోన్ లేదు. అలారం కొట్టే గడియారం లేదు. ఆ కొంపలో ఏ మూలనో ఓ గంపలో కొక్కురోకో అని కూసే కోడి కూడా లేదు. మరి నూకాలు ఎలా లేవగలిగింది?

రోజూ ఆ టైముకి లేచే అలవాటే ఆమెను లేపింది. చచ్చినట్టు లేవక తప్పని బతుకు భయమే ఆమెను లేపింది.

'ఓలమ్మో! టయిమైపోనాది లాగుంది'

నూకాలు గుండెల్లో చలిపుట్టింది. పక్కమీద నుంచి గభాల్న లేచి నించొంది. ఊడిపోయిన చీరను గబగబా చుట్టుకుంది. విడిపోయిన జట్టుని నిమిషంలో ముడి వేసుకుంది. ఆమె ముస్తాబు సరి. ప్రయాణానికి రెడీ.

ఆమె ఆధునికంగా కాకపోయినా, కనీసం శుభ్రంగానైనా తయారు కాలేదు. తట్టను పట్టుకుని బయల్దేరింది. బయల్దేరుతూ "లెగే గుంటా" అని కూతుర్ని లేపింది. ఆ గుంటకి తులసి అనే చక్కటి పేరు వున్నప్పటికీ, ఆ పేరుతో నూకాలు పిలిచేది చాలా తక్కువ.

గుంట లేవకపోతే, పిర్రమీద గట్టిగా చరిచింది నూకాలు.

చప్పున లేచి కూర్చుంది తులసి గుంట.

నూకాలు వెళ్ళిపోగానే తలుపులోన గెడపెట్టుకోవాలి. అదే ఆ గుంట చేయాల్సిన పని.

"గెడేసుకోపోతే ఏం? ఇంతోటి కొంపలో ఏముందని ఎత్తుకుపోతా

రోలమ్మా?"

"ఓలమ్మో. ఎత్తుకుపోడానికి ఏవీలేదా?"

"ఏటుందేటి?"

"నువ్వున్నావుకదే బంగారం" అని బంగారు గుంటని ముద్దులాడి, నవ్వుతూ వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు చంకలో బిడ్డలా తట్టను అపురూపంగా ఎత్తుకుంది.

తులసిగుంట చిన్న గుంట కాదు. బంగారు తీగ చెరుగ్గడలా ఏపుగా, ఎర్రగా, అందంగా ఎదిగిన గుంట. వయసు పదిహేనో ఏడు నడుస్తోంది.

తట్టతో తల్లి గడపదాటి వెళ్ళిపోయాక, క్షణంలో తలుపు గెడవేసుకొని, నేలపై బొంతపై మూడంకె వేసి, దుప్పటిలో ముసుగేసి నిద్రలోకి జారిపోయింది. దోమల సంగీతం, బొంతపై నల్లులూ, తలలో పేలూ, వంటగిన్నెలపై చప్పుడు చేసే ఎలకలూ ఏ మాత్రం ఆ గుంటకు నిద్రాభంగం కలిగించలేకపోయేయి.

***

నూకాలు నడుస్తోంది.

మామూలు నడక కాదు. పరుగులాంటి నడక.

నడక్కి చీర అడ్డురాకుండా కుచ్చిళ్ళు పైకి ఎగతోసి, నడుం భాగంలో గుచ్చి, పైట బిగకట్టి నడుస్తోంది.

చీకటి తెరలు తొలగకముందే, వేకువ రేఖలు విచ్చుకోకముందే నూకాలు రైలుని అందుకోవాలి. నలభై నిమిషాలు నడవాలి. ఆటో ఎక్కదు. రిక్షా ఎక్కదు. రైలెక్కే వరకూ నడకే నడక.

నూకాలు నడుస్తోంది. వాకింగ్ చేసేవాళ్ళూ, సైకిళ్ళపై, మోపెడ్‌లపై పాలబిందెల వాళ్ళూ, ఉద్యోగాలకు పరుగులెట్టేవాళ్ళూ, కుక్కల అరుపులూ, పక్షుల కిలకిలలూ. నూకాలు నడుస్తోంది. నడుస్తున్న నూకాలు ఆగింది. సిమ్మాద్రి కొట్టు రాగానే నూకాలు కాళ్ళకు బ్రేకులు పడేశాయి. అక్కడ పళ్ళు తోముకుని, ముఖం, కాళ్ళూ, చేతులు కడుక్కొనీ వేడివేడి టీ తాగుతుంది.

"మావాఁ నేను ఎప్పటిలానే వచ్చినానా, లేటయ్యినానా" అడిగింది నూకాలు.

"లేటయ్యావనంటే టీ తాగడం మానేయవుకదేటే. ఇదిగో ఈ టీ బేగ తాగేసి కుందేల్లా పరిగెట్టు" అని టీ ఇచ్చేదు సిమ్మాద్రి నవ్వుతూ.

మూడే మూడు గుక్కల్లో వేడి వేడి టీ చప్పరించేసి కుందేలు కన్నా హుషారుగా పరుగులు తీసింది ముప్పయి మూడేళ్ళ నూకాలు.

ఉరుకులు, పరుగులతో నూకాలు ఫ్లాట్ ఫారం మీదకు వచ్చింది.

రైలు ఏదీ?

అదిగో కదిలిపోతోంది!

నూకాలు గుండెలు గుభేల్మన్నాయి. "సచ్చేన్రా దేవుడోయ్" అనుకుంది. అలాని నిట్టూరుస్తూ రాటలా నిలబడిపోలేదు నూకాలు. పరుగులు తీసింది. తన శక్తినంతా కూడదీసుకుని, నీవా నేనా అన్నట్టుగా నూకాలు రైలుతో పోటీ పడింది. బోగీలోనున్న ఆమె స్నేహితులు తనని ఒక వైపు ఉత్సాహపరుస్తూనే, మరోవైపు "జాగర్తే నూకాలు" అని హెచ్చరించారు. ఎలాగైనా సరే తమ నూకాలు లోనకి వచ్చేయాలని గట్టిగా ఆశించేరు. ఆశిస్తున్న వాళ్ళకి ఆశాభంగం చేయలేదు నూకాలు. పరుగు లెడుతున్న నూకాలు ముందుగా ఆ బోగీలోకి తట్టను విసిరింది. మరుక్షణం తను లోపలికి చిరుతలా ఉరికింది. ఉరికేటప్పుడు తూలిపడిపోకుండా ఆడారి అచ్చన్న నూకాలుని ఒడిసి పట్టుకున్నాడు. లోనకి ప్రవేశించేటప్పటికి నూకాలు అతడి బాహువుల మధ్య వుంది. 'ఛీ' అనుకుంది. విదిలించుకుని అచ్చన్నకు దూరంగా జరిగింది.

ఒక పెద్దాయన నూకాలుని సన్నగా మందలించాడు.

"ఎందుకమ్మా. అంత రిస్కు. జారిపడిపోతే, ఆడపిల్లవి నీ బతుకేంకాను? మరో రైలు వచ్చే వరకూ ఆగొచ్చుకదా"

"మరో రైలు వచ్చే వరకూ ఆగే జీవితాలు కాదు బాబూ మావి. ఏటన్నారు? జారిపోతే నా బతుకేం గానా? బాగానే అన్నారు బాబూ. మావి జారుడు బతుకులే. రిస్కు బతుకులే. ఇలా బేజారుతో ఈ బజారు బతుకులు సాగాల్సిందే" అని నూకాలు అన్లేదు గానీ, ఆమె కళ్ళను చదివి అర్థం చేసుకున్నాడతడు.

ఆ బోగీలో నూకాలుతో పాటు ఆరు తట్టలున్నాయి. ఒక్క ఆడారి అచ్చన్న తప్ప మిగతావన్నీ ఆడతట్టలే. ఈవిధంగా రోజూ రైల్లో కలుసుకునేవాళ్ళే. పేదలే.. నిరుపేదలే. పేదరికం లేనిది వాళ్ళ స్నేహానికి మాత్రమే.

ఏ తట్టా ఏనాడూ టికెట్ తీసి రైలెక్కడం ఎరుగదు. ఆ పేద తట్టల్ని చూసీ చూడనట్టు వదిలేస్తారు టీసీలు. అటు వైపు చూడకుండా కళ్ళు మూసుకుంటే ఒక ముప్పావుగంటలో, వచ్చే స్టేషన్లో దిగిపోయే తట్టలవి.

రైల్లో వున్నంత సేపూ అంతా ఒక చోటనే చేరుతారు. గులాబీ పూవు రేకుల్లా ఒకరినొకరు అంటుకుపోయినట్టు దగ్గర దగ్గరగా కూర్చుంటారు. రైలు దిగేవరకూ వాళ్ళ మధ్య ఎన్నెన్నో పిచ్చాపాటి కబుర్లు, జోకులు, పాటలు, ఎకసెక్కాలు, వికవికలు, పకపకలు.

'ఎందుకమ్మా అంతరిస్కు' అని మందలించిన ఇందాకటి పెద్దాయన సింగల్ సీటులో తీరుబడిగా కూర్చొని ఆ తట్టల కట్టును చూసి, వాళ్ళ కబుర్లు విని ఎంతో ముచ్చటపడ్డాడు.

మనిషిపట్ల మనిషి సమష్టితత్వం, మానవ సంబంధ బాంధవ్యాలు, దృఢమైన స్నేహ సంబంధాలు ఈ రోజుల్లో కోల్పోతున్నామనే ఒక భావనలో, ఆందోళనలో వున్న అతనికి ఎదురుగా ఇదొక అనూహ్య దృశ్యం! పేదరికంలో మగ్గిపోతూ, అర్ధాకలితో అలమటిస్తూ బతుకులు ఈడ్చే ఈ తట్టలు నవ్వుతూ, ఇంత సరదాగా ఎలా వుండగలుగుతున్నాయి? బహుశా అలా వుండగలగడం కేవలం అట్టడగు జాతికే సాధ్యమేమో అని అనుకున్నాడు ఆ పెద్దాయన.

ఆడవాళ్ళ గుంపులో ఆడారి అచ్చన్న కూడా కలసిపోయి తనూ వాళ్లతో మాటా మాటా కలిపేదు. అక్కడితో వూరుకోకుండా మెల్లగా చేయి నూకాలుపై వేశాడు.

దాంతో ఇంజిన్ కూతలా కయ్ మంది నూకాలు.

"నీకిదేం పోయేకాలంరా సచ్చినోడా. నన్ను ముట్టుకోకుండా వుండలేవ(ట్రా, నీ జిమ్మడ"

"పాపం చెయ్యేస్తే ఏటయిపోతాదోలమ్మా. ఆడి చెయ్యి కూడా ఆడచెయ్యే అనుకోరాదేటే" అంది ఒక తట్ట నవ్వుతూ.

"అది కాదే నూకాలూ. నువ్వంటే ఆడు ఎందుకో పడి సచ్చిపోతాడే. నీవియ్యేళ లేటైనావు కదా. ఓలమ్మో, నువ్వు రాలేదని ఎంత గిజ గిజ లాడిపోనాడో ఎరికా" అంది మరో తట్ట.

"మరేటినేదే. ఆడికి పెళ్లం ముండ కావాల. మనందరికీ మొగుడు ముండా కొడుకులు ఏడుస్తున్నారాయే. ఎటొచ్చీ ఏ మొగుడూ లేకుండా తేరగా నీవే దొరికినా వు. అందుకే నీ మీద ఆంబోతులా పడిపోతున్నాడు... పోనీ నూకాలు ఆడిని మనువాడీసి మాకు పప్పన్నం పెట్టేద్దూ"

తట్టలన్నీ పకపకమన్నాయి. నూకాలు ముఖం మాడ్చుకుంది.

"ఎందుకలా ఏడిపిస్తారు దాన్ని" అని కసురుకున్నాడు ఆడారి అచ్చన్న.

అతని మాటలూ, చేతలూ, నడకలూ స్త్రీని పోలి ఉండటంతో అచ్చన్న అందరినోటా ఆడారి అచ్చన్నగా పిలవబడుతున్నాడు. నిజానికి అచ్చన్న సవ్యమైన పురుషుడే. కానీ ఆడంగితనం వల్ల తనని పెళ్ళి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. అతని వయసిప్పుడు ముప్పయ్యారు దాటింది.

ఎంచేతో అచ్చన్నకి నూకాలంటే ఇష్టం.

నూకాలు మాత్రం అచ్చన్నని గొంగళి పురుగులా చీదరించుకుంటుంది.

***

నూకాలుకి మొగుడు లేడంటే... ఏ మొగుడూ లేకుండా తులసి గుంటని భారతంలో కుంతిలా చడీ చప్పుడు లేకుండా కనీయడం కాదు. నూకాలుకి పెళ్ళి అయింది. పెళ్ళి అయిన రెండేళ్ళకి కాబోలు తులసి గుంటకి తల్లి అయింది. మరో గుంటకి తల్లి అయ్యే అవకాశం లేకుండా మొగుడుగాడు నూకాలును వదిలేశాడు. మరెవ్వరినో లేవదీసుకుని ఏ అండమాన్‌కో వెళ్ళి పోయేడు. మళ్ళీ కనబడలేదు. ఆ ముదనష్టపు మొగుడు.

మగోళ్లకంటికి నూకాలు బాగానే ఆనుతుందేమో.. పక్క వీధిలో వుండే పెంటారావు ఆమెను చేరదీశాడు. అప్పటికే పెంటారావుకి సత్తెమ్మ అనే పెళ్ళాం వుంది. ఇద్దరు పిల్లలూ వున్నారు. పాత మొగుడు కన్నా వుంచుకున్న పెంటారావే నూకాలుని బాగా చూసుకున్నాడు.తనకు పుట్టకపోయినా తులసి గుంటని ముద్దుగా చూసుకున్నాడు. అదృష్టవశాత్తు అతడికి అప్పటికే వేసెక్టమీ ఆపరేషన్ అయిపోవడంతో నూకాలుకి పిల్లల సంత తప్పి బతికిపోయింది.

పెంటారావు పెళ్ళాం సత్తెమ్మ సవతి నూకాలుని ఏమాత్రం సహించలేక పోయింది. మొగుడితో కాకుండా నూకాలుతో తరచు తగవులు పెట్టుకునేది. నూకాలు వూరుకుంటుందా? ఇద్దరూ వీధిలో జుట్టు జుట్టు పట్టేసేవారు. చివరికి వాళ్ళిద్దరి మధ్యా పోరుని పెంటారావు చావు మాత్రమే తీర్చగలిగింది. ఎంచేతో అతడు ఒక రోజు హఠాత్తుగా గుండె ఆగి చచ్చిపోయాడు. నూకాలు పెళ్ళి పెళ్ళం కాకపోవడంతో పెంటారావు ఆస్తిలో ఆమెకు ఒక పైసా కూడా దక్కలేదు. "పెంటారావు ద్వారా నీకు సంతానం కలిగివుంటే... ఏదో కొంత న్యాయం జరిగేలా చూసి వుండేవాళ్ళం" అని చేతులెత్తేశారు వూళ్లో పెద్దలు.

'మరిక నూకాలుకి మొగుడు యోగం లేదు, దీనికి మొగుడు అనేవాడు అచ్చిరాడు అని తేల్చేశారు' వూళ్ళో వాళ్ళు. మొగుడు లేని బతుకు ఎలా బతకాలి అని కాకుండా నూకాలు "కూతుర్ని ఎలా పెంచాలో, అందుకు తను ఏం చేయాలో" ఆ దిశగా ఆలోచించింది. కిందామీదా పడి ఎలాగైతేనేం బజారులో కూరగాయల వ్యాపారం మొదలెట్టింది. చుట్టుపక్కల ఏడు వూళ్ళనించి అందరూ ఆ బజారుకే వస్తారు. చాలా పెద్ద బజారు.

నూకాలు రోజూ రైలెక్కి తట్టనిండా కూరగాయాలు కొని, మోసుకుని తిన్నగా

ఆ బజారుకే వస్తుంది ఇంటికి వెళ్ళకుండా. తనతోబాటు వచ్చే మిగతా తట్టలు నగరంలో ఎక్కడెక్కడో అమ్మకాలు సాగిస్తాయి. నూకాలు బజారుకి వచ్చేటప్పటికి తులసి గుంట తమ జాగాలో చాప పరచి రడీగా వుంటుంది. తను చద్దన్నం తిని తల్లికి కూడా తీసుకు వస్తుంది.

ఉదయం తెచ్చిన కూరగాయలు చెల్లిపోతే, రెండు గంటల ప్రాంతంలో మరో ట్రిప్ వేసి రైలెక్కుతుంది నూకాలు. తట్టనిండా కూరగాయలతో సాయంత్రానికి బజార్లో రడీ అయిపోతుంది. ఇలా రోజుకి రెండుస్లారు రైలెక్కి దిగుతూ, బజార్లో, నడుంపడిపోయేలా రేయింబగలూ కూర్చున్నా జరుగుబాటు కష్టమైపోతోంది. తనకు అమ్మానాన్నా లేరు. అరడజను పిల్లలూ లేరు. ఒకే ఒక్క కూతురు. అయినా బతుకు సాగడం లేదు. నూకాలు గుండెల నిండా బాధ, దుఃఖం.

అప్పు అనేది ఒక రోగంలా నూకాలుని ఒక పక్క తినేస్తుంటే... ఇక తినడానికేం మిగులుతుంది. కూతురికేం పెడుతుంది. అది రేపు సవర్తాడితే కార్యం ఎలా చేస్తుంది?

ఆ బజారులోకి మైక్రో ఫైనాన్స్ సంస్థలు చొరబడకముందే. అక్కడ వడ్డీ వ్యాపారం విరాజిల్లుతోంది. నూటికి పది రూపాయల వడ్డీ. ఆ వడ్డీ నెల నెలా కాకుండా ప్రతిరోజూ కట్టాలి. అక్కడ వడ్డీ వ్యాపారుల మధ్య పోటీ వున్నా ఒక కట్టు వుంది. పోటీపడి ఒకే తట్టకి ఇద్దరు, ముగ్గురు అప్పులు ఇచ్చేయరు. ఒకరి వద్ద తీసుకున్న అప్పే ఆ తట్టలు తీర్చడానికి తలప్రాణం తోకకి వస్తుందని తెల్సు. నూకాలుకి మాత్రం మొదటి నుంచి అప్పు ఇస్తున్నది ఒక్క సురేష్‌బాబే. మరొకరు ఇవ్వరు. ఇవ్వడానికి వీల్లేదు. ముప్పయిరెండేళ్ళ సురేష్ బాబుకి ఇదే లాభసాటి వ్యాపారం.

***

కూత వేస్తూ హుషారుగా రైలు పరుగులు తీస్తోంది. తట్టలు కాస్తా అలసినట్టున్నాయి. కబుర్ల జడివాన తగ్గింది. నూకాలు మాత్రం మోకాళ్ళపై తల ఆన్చి కిటికీ లోంచి చూస్తోంది.

నీలి ఆకాశంలో మబ్బులు బజార్లో పరిచిన చాపల్లా వున్నాయి. దూరంగా ఎత్తుగా, పచ్చగా కొండలు. ఒక కొండపై ఏదో పెద్ద పక్షి వాలినట్టు గుడి. కిటికీ దగ్గర టప టపా పారిపోతున్న తీగల స్థంభాల్లా కాకుండా...దూరంగా నిలువెత్తు చెట్లు గంభీరంగా సాగుతున్నాయి. కనుచూపుమేరా ఆకుపచ్చ చీరలు ఆరేసినట్టు ఆహ్లాదకరమైన పంట పొలాలు. ఆ పచ్చని పొలాలమధ్య సాగిపోతున్న ఒక మట్టి

రోడ్డు. రోడ్డుపై పోతున్న మనుషులూ, వాహనాలూ...

"లెగు. లెగు టేషన్ వచ్చేసినాది" అంటూ నూకాలు నడుంపై చేయి వేశాడు ఆడారి అచ్చన్న.

మరుక్షణం అచ్చన్న చెంప ఫడేల్మంది.

ఆ చెంపదెబ్బకు నివ్వెరపోయినట్టు చప్పున ఆగిపోయింది రైలు.

ఫ్లాట్ ఫారంపై బిలబిలమని దిగిపోయాయి తట్టలు.

***

కాసేపటిలో అదే ఫ్లాట్ ఫారం మీదకు అవే తట్టలు పొలోమని చేరుకున్నాయి. కూరగాయలతో తట్టలు నిండుగా వున్నాయి. నలుగురి దిష్టి తగలకుండా, జారి పోకుండా గోనెలతో, గుడ్డలతో కప్పబడ్డాయి.

రైలు గంట లేటు అనడంతో నూకాలు గుండెలు గుభేల్మన్నాయి.

ఓలమ్మో! బజారుకి చేరేదెప్పుడు? - ఆమెలో బేజారు, బెంగ.

లేటుగా వచ్చిన రైలులోకి తట్టలన్నీ ఎక్కాయి. రైలు చాలా రష్‌గా వుంది. తట్టలన్నీ టాయిలెట్ వైపు ఒక చోట చేరాయి. అరడజను కర్రలను తాడుతో కట్టేసినట్టు వాళ్ళంతా ఒకేచోట నుంచున్నారు. ఇబ్బందిగా, ఇరుకుగా నుంచున్నా వాళ్ళ పిచ్చాపాటి కబుర్లు మామూలే. వాళ్ళ వికవిక నవ్వులూ మామూలే.

నూకాలు తనని చెంపపై కొట్టిన సంగతే మరిచాడు అచ్చన్న. అలాగే నూకాలు కూడా.

మరో నాలుగైదు నిమిషాల్లో వాళ్ళు దిగాల్సిన స్టేషన్ వచ్చేస్తోందనగా - హఠాత్తుగా ఆగిపోయింది రైలు.

ఎవరైనా చెయిన్ లాగేరా?

రైలు ఎందుకాగిందో తెలీదు. ఒక గంట లేటుగా నడుస్తూ ఆగిన రైలు ఇక్కడెంత లేటోమరి. రైలు ఆగిన చోటు మాత్రం నూకాలు బజారుకి చాలా చాలా దగ్గర.

ఇప్పటికే ఆలస్యమయింది. స్టేషన్‌లో దిగేకన్నా ఇక్కడే దిగిపోవడం మంచిదనుకుంది నూకాలు. ఈ విధంగా దిగడాలు తనకేమీ కొత్తకాదు. అది రిస్కు అనే భావన ఆమెకేమాత్రమూ లేదు.

దిగిపోతాననగానే నూకాలకు ఆమె మిత్రులంతా క్షణాలపై సహకరించారు.

"ముందు నీవు దిగే నూకాలు. కిందకి దిగ్గానే నీ తట్ట అందిస్తాం" అన్నాడు అచ్చన్న.

నూకాలు గబగబా రైలు దిగుతోంది.

అయ్యో! నూకాలు ఇలా దిగుతుండగా అలా రైలు కదిలింది. ఒక జర్క్ ఇచ్చి మరీ కదిలింది. నూకాలు కాసుకోలేక, చేతులు పట్టుతప్పి జారిపోయింది. జారిపడిపోయినప్పుడు తన కుడికాలు మోకాలు వరకూ పట్టాలపైకి, చక్రాల కిందకి వెళ్ళిపోవడం నూకాలు కానుకోలేదు. ఆమె బాధ, దృష్టి అంతా రైల్లో వుండిపోయిన తన తట్టకోసమే.

చెయిను లాగి రైలుని ఆపేశాడు అచ్చన్న.

అక్కడంతా హాహాకారాలు.గుండెలు బాదుకుని ఏడుస్తున్న మిత్రులు. గుండెలు పిండే ఆర్తనాదాలు. హృదయవిదారక అతి దారుణ భీతావహ పరిస్థితి.

ఎండమాయమై చీకటి మబ్బు కమ్మింది. నూకాలు మగతలోకి జారుకుంది.

***

నూకాలుని ఆస్పత్రికి అచ్చన్న మిగతా మిత్రులూ తీసుకువెళ్ళారు. ఎవరో ఇచ్చిన సలహాపై తెగిన కాలుని ఒక ప్లాస్టిక్ కవర్‌లో జాగ్రత్త చేసి, ఐసు ముక్కల మధ్య తట్టలో భద్రంగా పెట్టి ఆ తట్టను కూడా ఆస్పత్రికి పట్టుకువెళ్ళారు. తల్లి పక్కనే తులసి ఏడుస్తూ వుంది. ఎవరో ఆమెను తీసుకువచ్చారు.

ప్రభుత్వ డాక్టర్లు నిర్లక్ష్యం చేయకుండా నూకాలు కేసుని వెంటనే చూసారు. తెగిన కాలుని పరిశీలించారు. నూకాలుని ఆడ్మిట్ చేసుకోవడానికి ఆరోగ్యశ్రీ, తెల్లకార్డులు అడిగారు. అడగ్గానే అక్కడ అందరి దృష్టి తులసి వైపు మళ్ళింది.

తులసి గుండెలు గుబగుబ లాడేయి.

'అంటే ఆ కార్డులు తేవాలన్న మాట. లేకుంటే అమ్మను చూడరన్నమాట' – తులసికి జ్వరమొచ్చినట్టు అయిపోయింది. ఏడుపు తన్నుకొచ్చేసింది.

"కార్డులు మా దగ్గర లేవు బాబు.తాకట్టులో వున్నాయి"– అని వున్న విషయం బయట పెట్టేస్తే. అమ్మను కూడా బయటపెట్టేస్తారు. అలా జరగడానికి వీల్లేదు. అమ్మకి ఆస్పత్రిలో మంచం ఇవ్వాల. ఆపరేషను చేయాల. విరిగిన కాలు అతుక్కోవాల."

అందుకు కార్డులే కదా కావాల?

"నేను తీసుకొస్తాను" అంది తులసి స్థిరంగా, నిబ్బరంగా, ధైర్యంగా.

తోడుగా ఎవరో రావడానికి సిద్ధపడితే, వద్దని చెప్పి తనొక్కర్తే బయల్దేరింది.

గుండెల నిండా సంకల్పబలంతో, ఆత్మవిశ్వాసంతో వడివడిగా అడుగులు ముందుకు వేసింది తులసి గుంట.

***

తులసి గుంటకి తల్లి అంటే ఎంత ఇష్టమో చదువుకోవడమన్నా అంతే ఇష్టం. కటిక పేదరికం తన చదువుకి అడ్డంకి అయింది. తులసి తండ్రి కాని తండ్రి పెంటారావు హఠాన్మరణంతో చదువు అర్థాంతరంగా ఆగిపోయింది. ఆ తర్వాత బడికి వెళ్తానంటే తల్లి ఒప్పుకోలేదు గాక ఒప్పుకోలేదు.

"మింగడానికి మెతుకు లేదని నేనేడుస్తుంటే సదువు సదువని నన్ను సంపుకు తింటావేటే గుంట ముండా" అని తిట్టీ, కొట్టీ పూర్తిగా బడిని మర్చిపొమ్మంది నూకాలు. అదెలా సాధ్యం? బడి ఎక్కడో లేదు. బజారుని అనుకునే వుంది. తులసి గుంటకు రోజూ బడినీ, బడిలో పిల్లలనీ చూస్తుంటే ఏడుపొచ్చేది.

"అయ్యో! తులసి గుంటని చదివించలేకపోయానే" అని ఏనాడూ బాధపడ లేదు నూకాలు.

తులసి గుంటకి తొమ్మిదేళ్ళు దాటిన కానించే ఈ దొంగ గుంట ఏ క్షణంలో చాపమీద కూర్చుండి పోతుందోనని భయపడిపోయేది నూకాలు. ఏమంటే అది ఖర్చుతో కూడుకున్న సందడి. సవర్త కార్యక్రమానికీ, వూళ్ళో భోజనాలకీ ఎంత హీనంగా లెక్కలేసినా ఖర్చు పాతికవేలు పైనే దాటుతుంది. తన దగ్గర తంతే పైసా లేదు. ఈ గుంట గభాల్న సవర్తాడితే నేనెందులో పడి సచ్చేది దేవుడోయ్ అని గుండెలు బాదుకునేది నూకాలు.

ఏళ్ళ తరబడి సవర్తాదకుండా తల్లిని ఏడిపించి, ఏడిపించి, చివరికి పద్నాలుగో ఏట, పైడి తల్లమ్మ పండుగ నాడు, తెల్లారుజామున, సిగ్గు మొలకలు వేయగా చాపమీద కూర్చుండిపోయింది తులసి గుంట. నూకాలుకి అదే పండుగ అయిపోయింది.

డబ్బు ఖర్చు పెట్టి వేడుక చేయడం వూళ్లో నలుగురి మధ్య ఏదో గొప్ప కోసం కాదు. అది వాళ్ళ సంస్కృతి. పద్ధతి.

"అనవసరంగా ఈ దండగ ఖర్చు చేయకమ్మా" అని ఎంతటోళ్ళు నచ్చజెప్పినా వినిపించుకోలేదు నూకాలు. తీసుకున్న డబ్బుకి వడ్డీలు సవ్యంగా కట్టలేక పోయేది నూకాలు. అప్పుడే ఆమె నుంచి ఆరోగ్యశ్రీ, తెల్లకార్డులు స్వాధీనం చేసుకున్నాడు సురేష్ బాబు. తెల్లకార్డుని కొంత ఉపయోగించుకోవచ్చు. కాని ఆరోగ్యశ్రీ వల్ల అతనికేమీ లాభం లేదు. నూకాలు లాభపడగూడదని ఒళ్ళుమంటతో, కోపంతో తన దగ్గర అట్టిపెట్టుకున్నాడంతే. ఆ కార్డులు తప్ప నూకాలు వద్ద ఇక ఏ ఆస్తులూ లేవు మరి.

"సవర్తకే నాకు సచ్చినంత పనయ్యిందే. ఇన్ని పిల్లి మొగ్గలు ఏసినానే. రేపు ఈ గుడిసేటి గుంటకి పెళ్ళి సేయగలనా. ఓలమ్మో నా వొల్ల కాదు రోయ్ దోవు

డోయ్" అని ఇరుగు పొరుగు ముందు నెత్తికొట్టుకుని, చేతులెత్తేసేది నూకాలు.

గుర్రంలా ఎదుగుతున్న తులసి గుంటను చూసి భయపడిపోయేది నూకాలు. సురేష్‌బాబు దాన్ని తినేసేలా చూస్తుంటే ఆ దొంగ సచ్చినోడిని కసక్కుమని కత్తితో పొడిచేయాలనిపించేది.

లాభం లేదు. ఈ గుంటనిక నడిబజారులో కూర్చోబెట్టకుండా, ఇంటికే పరిమితం చేసేస్తే బాగుంటుదేమో అని చాలాసార్లు అనుకుంది నూకాలు.

కానీ ఈ గుంట ముండ బజారులో కూర్చుంటేనే చకచకా కూరగాయలు చెల్లుబాటు అవుతున్నాయి. బేరాలు సాగుతున్నాయి. ఏం చేస్తుందిక?

వంకాయల ఖరీదు ఎంత, బెండకాయల ఖరీదు ఎంత అన్నట్లుగానే నీ ఖరీదు ఎంత అని ప్రత్యక్షంగా, పరోక్షంగా అడిగే పోకిరీ వెధవలు వస్తుంటారు. అలాంటి బేరగాళ్ళ బారిపడకుండా తులసి గుంటకి కాపు కాసేది నూకాలు. నలుగురిలో అల్లరి పడకుండా ఎలా తప్పించుకోవాలో జాగ్రత్తలు చెప్పేది. తక్కెడ తూకం తప్పిపోకుండా చూసుకునేది.

తల్లి బోధలు చిరాకుపడకుండా తులసి గుంట బుద్ధిగా వినేది. ఆచరించేది.

జాగ్రత్తపడేది. అయితే తనకు చెప్పిన జాగ్రత్తలు తల్లి ఎందుకు పాటించేది కాదో తనకు అర్థం కాక కోపం వచ్చేది. అసహ్యం వేసేది. రాత్రి భోజనాలు అయ్యేక, అప్పుడప్పుడు బయటకు వెళ్ళిపోయి, ఏ అర్ధరాత్రో, ఇంటికి వచ్చేది తల్లి.

"ఏటోలమ్మా ఇంతరాత్రప్పుడు ఎక్కడకెళ్ళి వస్తున్నావు? ఏటి చేస్తున్నావు" అని ఏనాడూ తను ప్రశ్నించలేదు. తల్లి ఏమి చేస్తున్నదీ, ఎందుకు చేస్తున్నదీ కొన్నాళ్ళకు అర్థమయ్యింది. అర్థమయ్యేక కోపం పోయి దుఃఖం వచ్చేది.

ఒంటరిగా ఒక మూలన కూర్చొని ఏడ్చేది.

ఒకరోజు రాత్రి తల్లిపక్కలో చేరి, తల్లిని గట్టిగా చుట్టేసి "అమ్మా మనం ఏ పురుగుల మందో తాగి సచ్చిపోదామే" అని ఏడ్చింది. నూకాలు ఏడ్చింది. తల్లీ కూతుళ్ళిద్దరూ ఒకరినొకరు పట్టుకుని ఆ ఇంట్లో శవం లేచినంతగా ఏడ్చారు. తర్వాత నూకాలు కూతురికి బతుకుపై ధైర్యం నూరిపోసింది. మరోసారి చావు మాట ఎత్తకుండా ఒట్టు వేయించుకుంది. "నీనేమైపోయినా ఫర్వాలేదే గుంటా. నువ్వు మాత్రం నూరేళ్ళు సల్లగా బతకాల" అని కూతురు నుదుటిపై ముద్దు పెట్టుకుంది నూకాలు.

దారిద్ర్యంలో ధర్మాలను పాటించడం కన్నా ఈ భౌతిక దేహాన్ని నిలుపుకోవడం

అగత్యం. నీతి నియమావళిని ఆకలి ఖాతరు చేయునా? పేదరికం పట్టించుకుని భయపడునా? నూకాలుకి మాత్రం సంఘ భయం వుంది. తను చేస్తున్నది చేయరాని తప్పనే భావన వుంది. అంచేతనే నలుగురి కళ్ళు కప్పి చాటు చాటుగా, భయం భయంగా అందులోకి దిగేది.

రోజూ వడ్డీల కోసం వస్తూ, తనని తినేసేలా చూసే సురేష్‌బాబు అంటే తులసి గుంటకి పరమ అసహ్యం. ఆ చెండాలవు వెధవ తనవైపు చూసే లైంగిక చూపులూ, నీచపు వికృత చేష్టలూ భరించలేకపోయేది.

ఒకరోజు ఆ దొంగబాడుకవ్ తన గుండెల్ని నొక్కి, వెకిలి నవ్వు నవ్వేడు. వీడికి కుష్ఠు రోగం రాను. కాలూ, చేయి పడిపోను. ఏదోక రోజు పెద్ద దినం చేసెయ్య.

తనని ఎలాగైనా లొంగదీసుకోవాలని చూస్తున్నాడు. ఆ సంగతి అమ్మకి తెల్సు. అలాగే ఆ దొంగ సచ్చినోడికి తను లొంగే గుంటముండను కాదని కూడా అమ్మకి తెల్సు.

నిజమే. అది నిన్న మొన్నటి వరకు. ఈ రోజు సీన్ మారింది. విధి బలీయం.

***

సురేష్‌బాబు మోటర్ బైక్‌పై తులసి గబగబా ఆస్పత్రికి చేరుకుంది.

ఆస్పత్రి వారికి ఆరోగ్యశ్రీ, తెల్లకార్డులు అందజేసింది. తల్లి ఆపరేషన్‌కి తను కార్డులు తేవడమే ఆలస్యమనుకుంది. ఎదురుచూడ్డమే కానీ డాక్టర్లని ఏదీ అడగలేరు.

తులసి, తట్ట మిత్రులూ ఆస్పత్రి ఆవరణలో గంటల తరబడి బొమ్మల్లా నిలబడిపోయేరు. ఎట్టకేలకు ఆపరేషన్ థియేటర్ నుండి వార్డులోకి నూకాలుని తీసుకువచ్చారు. మిత్రులంతా నూకాలు కాలుని చూసి నిశ్చేష్టులై, కంటతడి పెట్టారు. తులసి గట్టిగా ఏడ్చేసింది.

ఇలాంటి క్లిష్టమైన కేసులు విజయవంతమవడం కష్టమని తెలియజేస్తూ, తెగిన కాలుని అతికించలేకపోయినందుకు విచారం వెలిబుచ్చి,బాధపడ్డారు డాక్టర్లు.

ఆస్పత్రి నుంచి బజారులోకి పడింది నూకాలు. ఒక మనిషి సాయం లేదా చంక కర్రలు లేకుండా ఒక్క అడుగు ముందుకు వేయలేని స్థితి. నూకాలు కుంగిపోకుండా, ఒంటరితనం, అభద్రతా భావం కలగనీయకుండా తులసి, అచ్చన్న, తట్ట మిత్రులూ జాగ్రత్తగా చూసుకున్నారు.

నూకాలుకి ఆడారి అచ్చన్న అంటే అసహ్యం లేదిపుడు. ఒక గొప్ప ఓదార్పు.

అచ్చన్న తన దగ్గరున్నంత సేపూ చంక కర్రల అవసరమే పడదు. అసలు అంగ వైకల్యమే గుర్తుకు రాదు. ఆ చీకటి బతుకులో ఆమెకు ఒక గొప్ప సుఖానుభూతి అతని స్పర్శ.

నూకాలుకిప్పుడు కూతురి మనువుకన్నా తన మనుగడే ప్రాధాన్యం. హుషారుగా నూకాలు బజారులో చాపమీద కూర్చొని కూరగాయల అమ్మకం సాగిస్తోంది.

తెల్లవారకముందే తులసి గుంట లేచి, నెత్తిపై తట్టతో రైలు కోసం, కూరగాయల కోసం తీరని అప్పులా పొడవుగా సాగిన రోడ్డుపై పరుగులు తీస్తోంది. ఎండిన చెట్టుకి లేచిన కొత్త చిగురులా, కోడెదూడలా కొండంత జీవితేచ్ఛతో పరుగులు తీస్తోంది.

*(నవ్య వీక్లీ - 09-11-2011)*